# నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

■ **ఆదిలాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్**



బోథ్ ఆర్వో కార్యాలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్వో చాహత్‌బాజ్‌పాయ్

బోథ్, నవంబర్ 2: బోథ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ రాహుల్‌రాజ్ వెల్లడించారు. గురువారం ఆర్వో చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి బోథ్ ఆర్వో కార్యాలయంలో ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ కేంద్రం వద్ద వంద మీటర్ల పాటు నిషేధాజ్ఞలు అమలవుతాయన్నారు. అభ్యర్థితో పాటు నలుగురికి కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. నామినేషన్ ప్రక్రియ నాటి నుంచి అభ్యర్థులు ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. సువిధ యాప్ ద్వారా సభలు, ర్యాలీలు, ప్రచార వాహనాలు, ఇతర వాటి కోసం 48 గంటల ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతిలేని వాటిని సీజ్ చేస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీల వారు ఎన్నికల కమిషన్ నియమావళిని పాటించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన బందోబస్తు వివరాలను బోథ్ సీఐ భీమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ ప్రక్రియ సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంతకుముందు నామినేషన్ కేంద్రం, హెల్ప్ డెస్క్‌లో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అంతుబాటులో ఉన్న తహసీల్దార్లు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట తహసీల్దార్ సుభాష్‌చందర్, అధికారులు ఉన్నారు.



బారీకేడ్లు కడుతున్న సిబ్బంది

**బోథ్‌లో...**

బోథ్, నవంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బోథ్ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తహసీల్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆర్వో కార్యాలయానికి ఇరువైపులా వంద మీటర్ల పాటు బారీకేడ్లు ఏర్పాటు చేశారు. ఆ రూట్లో 144 నిషేధాజ్ఞలు విధించారు. శుక్రవారం నుంచి ఈ నెలా 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఆర్వో చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేష్లు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యర్థితో పాటు నలుగురు వ్యక్తులను కలిసి ఐదుగురిని కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. నామినేషన్ పత్రాల జారీ, అఫిడవిట్, సందేహాల నివృత్తి కోసం ఆర్వో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, స్వతంత్రులు ఎన్నికల నియమావళిని అనుసరించాలని కోరారు.

**నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ**

ఎదులాపురం, నవంబర్ 2 : తెలంగాణ శాసన సభ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మేరకు ఆదిలాబాద్ ,బోథ్ శాసన సభ నియోజక వర్గాల్లో ఈ నెల 3వ తేదీ (శుక్రవారం) నుంచి నిర్వహించే నామినేషన్లు స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు ఆయా రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారని పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల వరకు మూడు వాహనాలకు అనుమతి ఉంటుందని, అభ్యర్థితో పాటు నలుగురు మద్దతుదారులతో కలిసి నామినేషన్ సమర్పించవచ్చని తెలిపారు. జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ దరఖాస్తులో అన్ని ఖాళీలను పూరించాలని, సంబంధిత పత్రాలను సమర్పించాలన్నారు.

## పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం



గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్

పెంబి, నవంబర్ 2 : ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరికలు ముమ్మరంగా సాగుతున్నాయి. పెంబి మండలంలోని రాయదారి ఉపసర్పంచ్ మహేశ్‌తో పాటు కర్ణంలొద్ది గ్రామాలలోని ఇతర పార్టీల యువకులు, నాయకులు బుధవారం రాత్రి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సమూచిత స్థానం కల్పిస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు భూక్యా గోవింద్, జాదవ్ సురేశ్, రాజేశ్, రావణ్, ప్రవీణ్, పరశురాం, రాము, బాపురావ్, తదితరులు పాల్గొన్నారు

## బందోబస్తు ఏర్పాటు చేయాలి

బోథ్, నవంబర్ 2 : బోథ్ అసెంబ్లీ ఎన్నికల నామినేషన్‌ల ప్రక్రియ సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సూచించారు. గురువారం బోథ్ ఆర్‌వో కార్యాలయాన్ని సందర్శించారు. నామినేషన్ల ప్రక్రియ ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ ఆర్‌వో కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. 100 మీటర్ల దూరం పాటు ఏర్పాటు చేసిన బారీకేడ్లను పరిశీలించారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే లోనికి అనుమతించాలన్నారు. అనంతరం బోథ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట బోథ్ సీఐ భీమేశ్, బోథ్, బజార్‌హత్నూర్ ఎస్ఐలు రాము, నరేశ్‌కుమార్ ఉన్నారు.



బోథ్ ఆర్‌వో కార్యాలయం వద్ద సూచనలు ఇస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

# బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్



శ్రీకాంత్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ అర్బన్, నవంబర్ 2 : నిర్మల్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కందుల శ్రీకాంత్ మంత్రి వ్యక్తిగత సోషల్ మీడియా కన్వీనర్ అన్వేశ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితుడై పార్టీలో చేరినట్లు ఆయన తెలిపాడు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు వీ సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తి, యువ నాయకులు అల్లోల గౌతం రెడ్డి, దేవరకోట ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, నాయకులు అశోక్ పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరిక



బజార్‌హత్నూర్ : బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన చందునాయక్‌తండా గ్రామస్తులు

బజార్‌హత్నూర్, నవంబర్ 2 : బోథ్ నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ సమక్షంలో చందునాయక్‌తండా ఉపసర్పంచ్ పద్వాల్ బాలాజీ, గ్రామంలోని బీజేపీ, కాంగ్రెస్, యువ జన సంఘ సభ్యులు 61మందితో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు. గురువారం నేరడిగొండలోని తన స్వగృహంలో జాదవ్ అనిల్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిత, రాబిడే బాలాజీ, గ్రామస్తులు, యవకులు, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన సిద్ధంవార్ వివేకానంద



వివేకానందకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి

కుభీర్, నవంబర్ 2 : కుభీర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దివంగత సిద్ధంవార్ దామాజీ కుమారుడు మున్నూరు కాపు మండల సంఘం అధ్యక్షుడు సిద్ధంవార్ వివేకానంద, 50 మంది యువకులు, ఆయా పార్టీల నాయకులు గురువారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ముథోల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డిగారి విఠల్‌రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. విఠల్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ మండలాధ్యక్షుడు ఎన్నీల అనిల్ ఆధ్వర్యంలో కష్టపడి పని చేసి భారీ మెజార్టీ సాధించే దిశగా తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. నాయకులు పాల్గొన్నారు.

# నాడు ఎలక్షన్ బహిష్కరణ.. నేడు నామినేషన్ ఖర్చులు ఇస్తాం

గుడిహత్నూర్, నవంబర్ 2 : గుడిహత్నూర్ మండలంలోని లింగాపూర్ గ్రామస్తుల పిలుపుమేరకు బుధవారం రాత్రి గ్రామానికి వెళ్లిన బోథ్ నియోజక వర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్‌కు గ్రామస్తులు, మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. అప్పటి ఎమ్మెల్యే ఈ గ్రామాన్ని దత్త తీసుకున్న అభివృద్ధికి నోచుకోలేదు. ఎమ్మెల్యే అభ్యర్థిగా జాదవ్ అనిల్ టికెట్ వచ్చిన తర్వాత గ్రామంలోని ఆలయానికి రూ.50 లక్షలు మంజూరు చేయించినందుకు గ్రామస్తులు ముందుగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. నాడు ఎలక్షన్ బహిష్కరణ అన్న గ్రామం నేడు నామినేషన్ ఖర్చు గ్రామం తరపున ఇస్తామని ప్రకటించారు. వందశాతం ఓట్లు కారు గుర్తుకు వేసి నియోజకవర్గంలోనే అదర్శంగా నిలుస్తామని గ్రామస్తులు ముక్తకంఠంతో ప్రకటించారు. ఈ సందర్భంగా జాదవ్ అనిల్ మాట్లాడుతూ మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పే కాంగ్రెస్, బీజేపీ నాయకులను నమ్మవద్దన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## జాదవ్ అనిల్ గెలుపు కోసం పాదరక్షలు వేసుకోనని ప్రతిజ్ఞ



తలమడుగు, నవంబర్ 2: సుంకిడి గ్రామానికి చెందిన జాదవ్ అజయ్ అనే యువకుడు తుల్జాపూర్ భవానీ అమ్మవారు సమక్షంలో బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ గెలిచేంత వరకు పాదాలకు చెప్పులు వేసుకోనని ప్రతిజ్ఞ చేస్తూ మొక్కుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తూ జాదవ్ అనిల్‌కు ఓటు వేయాలని కాళ్లకు పాదరక్షలు లేకుండా ప్రచారం చేస్తున్నారు.

పాదరక్షలు లేకుండా ప్రచారం చేస్తున్న జాదవ్ అజయ్